క్లుప్తంగా

కందుల కొనుగోళ్లు ప్రారంభం



కందుల కొనుగోళ్లను ప్రారంభిస్తున్న ఎంపీడీవో రవీందర్

సిరికొండ: మండల కేంద్రంలోని సిరి సంపద ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో కందుల కొనుగోళ్లను శనివారం ప్రారంభించారు. ఎంపీడీవో రవీందర్, డిప్యూటీ తహసీల్దార్ ఉపేందర్, సొసైటీ చైర్మన్ గోర్బండ్ ప్రకాశ్‌లు ప్రారంభించారు. సంస్థ రూ. 7,550 ధరతో కొనుగోలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి శ్రద్ధారాణి, మాజీ సర్పంచ్, ఉప సర్పంచ్ పెంటన్న, తోకల చిన్న రాజన్న, సొసైటీ సీఈవో జ్ఞానేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎంఐఎం ఆవిర్భావ వేడుకలు



స్వీట్లు తినిపించుకుంటున్న నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: ఎంఐఎం 67వ ఆవిర్భావ వేడుకలను నాయకులు ఘనంగా నిర్వహించారు. శనివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు నజీర్ ఎండా ఎగురవేశారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1957 మార్చి 11న పార్టీ ఆవిర్భావించిందన్నారు. ముస్లింల కోసం కాకుండా బడుగు బలహీన, పీడిత వర్గాల కోసం ఉద్యమించామన్నారు. కార్యక్రమంలో నాయకులు మహ్మద్ రోహిత్, ఇనాయత్, సిరాజ్ ఖాద్రి, షానవాజ్ పాల్గొన్నారు.

ముందస్తు చర్యలు తీసుకోవాలి

బోథ్: మండలంలో భూగర్భజలాలు తగ్గుతుండటంతో నీటి ఎద్దడి నివారణకు అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని సామాజిక కార్యకర్త జక్కుల వెంకటేశ్ అధికారులను కోరారు. రానున్న రోజుల్లో భూగర్భజలాలు మరింత తగ్గుముఖం పట్టే అవకాశం ఉందన్నారు. కరత్వాడ ప్రాజెక్టు నుంచి బోథ్‌కు నీటి సరఫరాల చేసేలా చూడాలన్నారు.

ముందుగానే సెలవు ప్రకటించాలి

ఆదిలాబాద్‌టౌన్: రంజాన్ పవిత్ర మాసం సందర్భంగా ఉపవాస దీక్షలు చేపట్టే ముస్లిం సిబ్బందికి గంట ముందు సెలవు ప్రకటించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ అన్నారు. శనివారం రిమ్స్ హెడ్ సూపర్‌వైజర్ బియ్యాల రవికి వినతిపత్రం అందజేశారు. రిమ్స్, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో పనిచేస్తున్న శానిటేషన్, పేషెంట్‌కేర్, సెక్యూరిటీ గార్డులు ముస్లిం సిబ్బందికి రంజాన్ మాసంలో గంట ముందుగా సెలవు ప్రకటించాలన్నారు. తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ రిమ్స్ బ్రాంచ్ ప్రధాన కార్యదర్శి ఎండీ ఖాసీం, సైఫ్ ఖాన్, అఫ్సాన్, ఆరిఫ్ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న జోగు రామన్న

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని తాటిగూడ కాలనీలో నిర్మిస్తున్న శ్రీకోదండ రామాలయం, శ్రీ వీరాంజనేయ స్వామి దేవాలయాలకు మాజీ మంత్రి జోగు రామన్న రూ. లక్ష విరాళంగా అందజేశారు. పట్టణంలోని ఆయన నివాసంలో శనివారం ఆలయ కమిటీ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అంబోతు దాడిలో ఎద్దు మృతి

ఇంద్రవెల్లి: అంబోతు దాడిలో ఎద్దు మృతి చెందిన ఘటన శనివారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. బాధితుడు మూసా తెలిపిన వివరాల ప్రకారం.. తన ఇంటి పరిసరాల్లో కట్టి ఉంచిన ఎద్దుపై మండల కేంద్రంలో తిరిగే అంబోతు దాడి చేసింది. ఎద్దు తీవ్రంగా గాయపడి మృతి చెందింది. ఎద్దు విలువ సుమారు రూ. 35 వేలు ఉంటుందన్నారు. తనను ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్ కోరెంగా సుంకట్‌రావ్, గ్రామ పంచాయతీ అధికారులు సందర్శించి మృతి చెందిన ఎద్దును పరిశీలించారు.

ఆకట్టుకున్న ప్రదర్శనలు

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ పంచాయతీ పరిధి మధురనగర్ నిస్సి పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించిన సైన్స్‌ఫేర్‌లో విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విద్యాలత, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నారు.

చెట్టు కిందే వంట



ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమల్లోకి వచ్చి ఏళ్లు గడుస్తున్నా సౌకర్యాలు మాత్రం కల్పించడం లేదు. నాణ్యమైన భోజనం సంగతి అటుంచితే వండేందుకు సైతం ఎండీఎం కార్మికులకు అవస్థలు తప్పడం లేదు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ హిందీ ఉన్నత పాఠశాల ఆవరణలో గల ప్రాథమిక పాఠశాలలో చదివే విద్యార్థులకు వంట చెట్టు కిందనే చేస్తున్నారు. మరుగుదొడ్ల పక్కనే ఇలా వంట చేస్తుండటం గమనార్హం.

– ఆదిలాబాద్‌టౌన్

దాహార్తి తీరేదెలా..?

మూగజీవాల దాహార్తి తీర్చేందుకు గ్రామాల్లో నిర్మించిన నీటితొట్టిలు నిరుపయోగంగా మారాయి. భీంపూర్ మండలంలోని అర్లి(టి) గ్రామంలోని నీటితొట్టిల్లో నీరు లేక శనివారం మూగజీవాలు అల్లాడుతూ కనిపించాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటితొట్టిల్లో నీరు నింపేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

– తాంసి



మాదిగ అమరవీరుల సంస్మరణ సభ

ఇచ్చోడ: ఎస్సీ వర్గీకరణ పోరులో అసువులు బాసిన అమరవీరుల సంస్మరణ సభను శనివారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అమరవీరుల చిత్రపటానికి నివాళులర్పించారు. బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి దుబాక సుభాష్, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెపు గణేష్ మాట్లాడుతూ.. మాదిగ జాతి భవిష్యత్ కోసం ఎస్సీ వర్గీకరణ పోరులో అసువులు బాసిన మాదిగ అమరుల త్యాగాలు మరువలేనివని కొనియాడారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు చిట్టి రవి, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పసుల శ్రీకాంత్, కాశిపాక విష్ణు, మచ్చ గంగారాం, పెంటన్న, అనిల్, మచ్చ అజయ్, రమేశ్, కొల్లురి గంగారాం పాల్గొన్నారు.

బేల: మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో శనివారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణ సాధన కోసం విలువైన ప్రాణాలను త్యాగం చేసిన మాదిగ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాదిగ అమరవీరుల చిత్రపటాల ఫ్లెక్సీకి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు కృష్ణపెల్లి అంకుష్, సభ్యులు పార్లవార్ అనిల్, జితేందర్, అశోక్, అంకుష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌రూరల్: ఎస్సీ వర్గీకరణ సాధించడంలో అమరులైన మాదిగ అమరవీరుల సంస్మరణ దినోత్సవ వేడుకలను శనివారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ భవనంలో తెలంగాణ మాదిగ జేఏసీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అమరవీరుల ఫ్లెక్సీకి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా అధ్యక్షుడు మల్యాల మనోజ్ మాదిగ మాట్లాడుతూ.. ప్రస్తుతం జరుగుతున్న ఎస్సీ వర్గీకరణ మాదిగ అమరవీరులకే అంకితమన్నారు. అమరవీరుల అమరత్వాన్ని స్ఫూర్తిగా తీసుకుని ఎస్సీ వర్గీకరణ కోసం ఎన్నో సంవత్సరాలు పోరాటం చేశామన్నారు. అసెంబ్లీ సమావేశాలలో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని నిర్ణయం తీసుకున్నందుకు సీఎంకు, మంత్రులకు ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు నక్క రాందాస్, లింగంపల్లి ప్రసన్నకుమార్, జువ్వకా నరసింహులు, కత్తి గంగాధర్, తారా రవికుమార్, ముక్కెర అశోక్, బట్టు మహేందర్ పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



నివాళులర్పిస్తున్న నాయకులు



పాల్గొన్న యూత్ సభ్యులు

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో..

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ భవనంలో మాదిగ జాతి అమరవీరులకు నివాళులర్పించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేశ్ మాట్లాడుతూ మాదిగ జాతి పోరులో అమరులైన వారి త్యాగాలు వృథాకావన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు వినయ్, సాగర్, గణేష్, సూర్యకాంత్, సాయన్న, కిరణ్, సాంటేన్న పాల్గొన్నారు.

హమ్మయ్యా.. చేపలు దొరికాయ్

ఆదివాసీ మహిళలు శనివారం సాయంత్రం కోసుగూడ వాగులో చేపల వేటకు వెళ్లారు. పెద్ద పెద్ద చేపలు వలలో పడ్డాయి. దీంతో వారి ఆనందానికి హద్దులు లేకుండా పోయింది. ఈ దృశ్యాన్ని 'సాక్షి' క్లిక్ మనిపించింది.

– ఇచ్చోడ



పుస్తకం ఆవిష్కరించిన కలెక్టర్



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: ఉపాధ్యాయులు విద్యార్థుల్లో జిజ్ఞాసను పెంపొందించి, వారిని భావిశాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా సూచించారు. జైనథ్ ఆదర్శ పాఠశాల అధ్యాపకులు జి. సత్యనారాయణ రచించిన 'భారతీయ, పాశ్చాత్య శాస్త్రవేత్తలు' అనే పుస్తకాన్ని శనివారం తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఉపాధ్యాయులు తమ జ్ఞానాన్ని, వృత్తిపరమైన అనుభవాలను గ్రంథస్తం చేసి భావి తరాలకు అందించాలని సూచించారు. మన దేశానికి సంబంధించిన శాస్త్రవేత్తల గురించి తెలియజేసేలా పుస్తకాన్ని రచించడం మంచి ప్రయత్నమని అభినందించారు. కార్యక్రమంలో ఆరోగ్య పాఠశాల కోఆర్డినేటర్ అజయ్, పాఠశాల ప్రిన్సిపాల్ రాము, రాఘవేందర్ పాల్గొన్నారు.

రంజాన్ సరుకులు పంపిణీ

ఆదిలాబాద్‌టౌన్: పవిత్రరంజాన్ మాసాన్ని పురస్కరించుకొని నిరుపేద ముస్లిం కుటుంబాలకు సరుకులను పంపిణీ చేస్తున్నట్లు సఫాబైతుల్ మాల్ అధ్యక్షుడు సయ్యద్ ముబషిర్ అహ్మద్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవో గార్డెన్‌లో శనివారం నిరుపేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు ఆచరించే పేద ముస్లిం కుటుంబాలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వీటిని అందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ హజ్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు షాహిద్ అహ్మద్ తవక్కల్, ముఫ్తి ముస్తఫా, హఫీజ్ బసీర్ అహ్మద్, హఫీజ్ ఖాసిమ్, అర్ఫాత్, మంజూర్ అహ్మద్ పాల్గొన్నారు.



సరుకులు పంపిణీ చేస్తున్న సభ్యులు

కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్



మెటీరియల్ పంపిణీ చేస్తున్న దుర్గే కాంతారావు

నార్నూర్: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల పదో తరగతి విద్యార్థులకు శనివారం పీఏసీఎస్ డైరెక్టర్ దుర్గే కాంతారావు ఎస్ఆర్ కళాశాల ఆదిలాబాద్ వారి ఆధ్వర్యంలో పరీక్ష సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో విద్యార్థులు కష్టపడి ఇష్టంతో చదివితేనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. సమయం ఎంతో విలువైందని, వృథా చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ ప్రశాంత్, ఎస్సార్ కళాశాల పీఆర్వో విజయ్, తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

నార్నూర్ మండలంలోని తడిహడప్నూర్ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఐటీడీఏ ద్వారా అందించిన పరీక్ష సామగ్రిని శనివారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు బలిరామ్ రాథోడ్, వార్డెన్ అమిత్ కుమార్ చేతుల మీదగా పంపిణీ చేశారు. 30 మంది విద్యార్థులకు ప్యాడ్‌లు, పెన్నులు, చేతి గడియారం, స్కిల్స్, నోట్ బుక్స్, జామిత్రీ బాక్సులు అందజేశారు. కార్యక్రమంలో కుమ్ర తానాజీ, జాదవ్ పరశురామ్, పవార్ బలరాం, జాదవ్ రాజేశ్‌బాబు, కవన కోకిల బంకట్‌లాల్, తదితరులు పాల్గొన్నారు

భాగవత్ కథ సప్తాహం ముగింపు

నార్నూర్: మండలంలోని భీంపూర్ శనీశ్వర ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా నిర్వహించిన భాగవత్ కథ (సప్తహ) శనివారం ముగిసింది. గ్రామస్తులు, మాజీ జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ పాల్గొని పూజలు చేశారు. గ్రామంలో ఆధ్యాత్మిక భావంతో ఏర్పాటు చేసిన భాగవత కథ ప్రజల్లో ఎంతో మార్పు తీసుకువస్తుందన్నారు. ఆధ్యాత్మికంతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో నంగారాభేరి జిల్లా అధ్యక్షుడు జాదవ్ సంజీవ్ నాయక్, లంబాడా జేఏసీ నాయకులు నారాయణ, గ్రామపెద్దలు గులాబ్ మహరాజ్, పవార్ దేవిదాస్, గంగారాం నాయక్ పాల్గొన్నారు.



పాల్గొన్న మాజీ జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్

సూపరింటెండెంట్‌కు సన్మానం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా విద్య శాఖాధికారి కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన వెంకట రమణను జిల్లా విద్య శాఖ అధికారులు ఘనంగా సన్మానించారు. శనివారం డీఈవో కార్యాలయంలో ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో ప్రణిత మాట్లాడుతూ.. సంఘ బాధ్యుడిగా, సూపరింటెండెంట్‌గా ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో కార్యాలయ ఏడీ వేణుగోపాల్ గౌడ్, ఏసీ వేణుగోపాల్ రెడ్డి, సూపరింటెండెంట్ మధుసూదన్ రెడ్డి, సెక్టోరియల్ అధికారి నారాయణ, ఉద్యోగులు పాల్గొన్నారు.



సన్మానిస్తున్న డీఈవో, ఉద్యోగులు

ఉపాధ్యాయుడికి సన్మానం..

తాంసి: మండలంలోని కప్పర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు విలాస్‌గౌడ్ శుక్రవారం ఉద్యోగ విరమణ పొందాడు. కాగా శనివారం పాఠశాలలో విలాస్‌గౌడ్, కృష్ణ కుమారి దంపతులను ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు సన్మానించారు. ఈ సందర్భంగా జ్ఞాపిక అందజేశారు. పాఠశాల హెచ్ఎం ఆనంద్, ఉపాధ్యాయులు కిష్టన్న, సంతోశ్, సదానంద్, మహేందర్ పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్ నిజాయతీ

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని ఆర్ఆర్ నగర్‌కు చెందిన కొమ్ము వనజ శనివారం సుందరయ్యనగర్ నుంచి మధ్యాహ్నం ఆటోలో అశోక్ రోడ్డుకు పని నిమిత్తం బయలుదేరింది. ఆటో దిగిన సమయంలో పర్సును అందులోనే మరిచిపోయింది. ఆటోడ్రైవర్ పర్సును గమనించి వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించాడు. సీఐ సునీల్ కుమార్ వివరాలను తెలుసుకుని ఆమెను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి పర్సులో ఉన్న రూ. 12వేల నగదుతో పాటు, మూడు సెల్‌ఫోన్లను అప్పగించారు. నిజాయితీని చాటుకున్న ఆటో డ్రైవర్ జామీల్ ఖాన్‌ను అభినందించారు.



పర్సును మహిళకు అందజేస్తున్న సీఐ

మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట

ఆదిలాబాద్‌రూరల్: గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో మైనార్టీ సంక్షేమానికి పెద్దపీట వేసిందని మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. మొదట రంజాన్ ఉపవాసాల సందర్భంగా మాజీ మంత్రి జోగు రామన్న మైనార్టీ సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. శనివారం మావల మండలంలోని పలు అభివృద్ధి పనులను జోగు రామన్న పరిశీలించారు. మైనార్టీ సంక్షేమానికి రూ. 17 కోట్లు మంజూరు చేసుకోవడం జరిగిందన్నారు. మైనార్టీ సంక్షేమానికి మైనార్టీ గురుకులాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అనంతరం కమిటీ సభ్యులు జోగురామన్నను శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మదర్, అమిమ్ బాయ్, ఆసిఫ్ ఖాన్, ఆసీం బాయ్, జెమి ల్, నాయకులు యూనుస్ అక్బానీ, సాజిదొద్దీన్, తదితరులు పాల్గొన్నారు.



మాజీ మంత్రిని సన్మానిస్తున్న మైనార్టీ నాయకులు

'అమరుల త్యాగాలు వృథా కావు'

బోథ్: మాదిగ జాతి కోసం పోరాడిన అమరుల త్యాగాలు వృథా కాలేదని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుడాల స్వామి అన్నారు. శనివారం బోథ్ మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు అన్నెపాగ అశోక్, కారెం రవిల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మాదిగ జాతి అమరవీరుల నివాళుల కార్యక్రమంలో పాల్గొన్నారు. మాదిగ జాతి హక్కుల ఉద్యమంలో భాగంగా ప్రాణాలను వదిలిన వారికి స్మరించుకుని, నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు అడెల్లు, మహేశ్, గంగయ్య, రవి, చందు, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నాయకులు